ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
మంగళవారం 3 మార్చి 2026

## ఖమ్మం కూల్చివేతలపై కేరళ సీఎం పినరయి విజయన్ ఘాటు విమర్శలు



**ప్రతిఘటన, హైదరాబాద్**

ఖమ్మం నగర పరిధిలో గల వెలుగుమెట్ల కూల్చివేతలపై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఎక్స్ వేదికగా సోమవారం తీవ్రమైన విమర్శలు చేశారు. తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని, అందుకే ఖమ్మంలో కాంగ్రెస్ ప్రభుత్వం 700 ఇళ్లను కూల్చేసి 3,000 మందిని నిరాశ్రయులను చేసిందన్నారు. బీజేపీ మోడల్ బుల్డోజర్ రాజ్యాన్ని తెలంగాణలో కాంగ్రెస్ అనుసరిస్తుందన్నారు. తెలంగాణలో అణగారిన వర్గాలపై కాంగ్రెస్ చేస్తున్న దాడులకు సమాధానం చెప్పాలన్నారు. పేదల పట్ల అన్యాయంగా ప్రవర్తించిన కాంగ్రెస్, కేరళలో ప్రజలకు అండగా నిలబడతామని చెప్పడం సిగ్గుచేటని కేరళ సీఎం విమర్శించారు.

**కేరళ సీఎం కామెంట్స్‌కు పొంగులేటి కౌంటర్**

ఖమ్మం వెలుగుమెట్ల కూల్చివేతలపై కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన విమర్శలపై మంత్రి పొంగులేటి గట్టిగా సమాధానమిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చట్టపరమైన నిబంధనల మేరకే వ్యవహరిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లపుడూ పేదల పక్షాన నిలబడి, వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. ప్రభుత్వ భూములను రక్షించడం అంటే, భవిష్యత్తు తరాల కోసం ఆస్తులను కాపాడటమేనని కౌంటర్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం చేపడుతున్న ఈ చర్యలపై ఇతర పార్టీలు బుల్డోజర్ ముద్ర వేయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని పొంగులేటి మండిపడ్డారు. వెలుగుమట్ల గ్రామంలోని భూదాన్ భూములను ల్యాండ్ మాఫియా నకిలీ పత్రాలతో అమాయక ప్రజలకు విక్రయించిందని గుర్తుచేశారు. దోచుకున్న సొమ్మును తిరిగి బాధితులకు చెల్లించేలా చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసమే సీఎం పినరయి విజయన్ స్పందించారని మంత్రి పొంగులేటి అన్నారు.

## బీటెక్ విద్యార్థినిపై ఇద్దరు యువకులు అఘాయిత్యం

**ఏడాది నుంచి అఘాయిత్యం చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు**

**బాచుపల్లిలోని వివిఎస్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో ఘటన**



**ప్రతిఘటన, మేడ్చల్ :** మహిళా రక్షణ కోసం ప్రభుత్వాలు చర్యాలు తీసుకుంటున్నప్పటికీ దారుణాలకు అడ్డుకట్టపడడం లేదు. అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్స్, పోలీస్ డిపార్ట్ మెంట్ అవగాహన కల్పిస్తున్నప్పటికీ మాయమాటలకు మోసపోతున్నారు కొందరు యువతులు. తాజాగా బాచుపల్లిలోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో దారుణం చోటుచేసుకుంది. తోటి విద్యార్థినీ పై ఇద్దరు యువకులు అఘాయిత్యానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. బాధితురాలితో చనువుగా ఉన్న ఆసీస్ అనే విద్యార్థి ఈ దారుణానికి ఒడిగట్టినట్లు బాధితురాలు తెలిపింది. ఏడాది నుంచి ఆసీస్ అఘాయిత్యం చేస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆసీస్ తో పాటు ప్రవీణ్ అనే వ్యక్తి తనపై మిస్ బిహేవ్ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నది బాధితురాలు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి పోలీసులు తెలిపారు. బాధితురాలు బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతుండగా ఇరువురు యువకులు సహా–విద్యార్థులుగా సమాచారం.

**షాకింగ్ విషయాలను బయటపెట్టి బాధిత విద్యార్థిని**

విఎన్ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ బాధిత విద్యార్థిని ఢ పేరెంట్స్ మాట్లాడుతూ.. "బాచుపల్లి లో విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో 2024 బ్యాచ్ మాది.. నేను బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్నాను.. నా పై ఇద్దరు నా క్లాస్ మేట్స్ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆసీస్ అనే స్టూడెంట్ నన్ను ప్రేమ పేరుతో వేధించాడు.. నన్ను భయపెట్టాడు నాతో చనువుగా ఉన్నప్పుడు ఆసీస్ వీడియోస్ ఫొటోస్ తీసి బెదిరించాడు.. నన్ను క్లాస్ రూమ్ లోనే అత్యాచారం చేశాడు.. ఏడాది నుంచి ఆసీస్ అనే స్టూడెంట్ నాపై అత్యాచారం చేశాడు.. ఆసీస్ తో పాటు ప్రవీణ్ అనే స్టూడెంట్ తనపై మిస్ బిహేవ్ చేశారు.. నాకు మత్తు పదార్థం ఇచి ఓయో రూమ్స్ తీసుకువెళ్లి ఆసీస్ అత్యాచారానికి పాల్పడ్డాడు. నేను స్పృహలో లేనప్పుడు వీడియోస్ ఫొటోస్ తీసి నన్ను బ్లాక్ మెయిల్ చేశాడు.. నాకు జరిగిన అన్యాయాన్ని పేరెంట్స్ దృష్టికి తెచ్చాను.. మా పేరెంట్స్ కాలేజ్ మేనేజ్మెంట్ ను ప్రశ్నించారు.. కాలేజ్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ లేదు.. దీంతో బాచుపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాము. మేము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నరు బాచుపల్లి పోలీసులు.. ఫిబ్రవరి 28న ఎఫ్ఐఆర్ నమోదయింది.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.. మాకు న్యాయం జరగాలి" అని బాధితురాలు తన గోడు వెల్లబోసుకుంది.

## హోలీ రోజు వైన్స్, బార్లు బంద్

**పతిఘటన, హైదరాబాద్ :** మందుబాబులకు హైదరాబాద్ పోలీసులు షాకింగ్ న్యూస్ చెప్పారు. హోలీ సందర్భంగా మంగళవారం నగరంలోని వైన్స్, బార్లు బంద్ చేయనున్నారు. ఈ మేరకు ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ జీ సుధీర్ బాబు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లు మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. స్టార్ హోటల్లు, రిజిస్టర్డ్ క్లబ్‌లలో నిర్వహిస్తున్న బార్లకు ఈ ఆదేశాలు వర్తించవని స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంతంగా, సురక్షితంగా హోలీ పండుగను జరుపుకోవాలనే ఉద్దేశంతో తెలంగాణ ఎక్సైజ్ చట్టం--1968 ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆదేశాలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఓవైసీ.. ఇరాన్ వెళ్లాలని ఉంటే చెప్పండి

**నేనే స్వయంగా ఫ్లైట్ టికెట్ బుక్ చేసి ఇస్తాను**

**ఖమేనీపై అంత ప్రేమ ఉంటే అక్కడికి వెళ్లి యుద్ధం చేయండి**

**భారత్‌లో ఉంటూ ఇతర దేశాధినేతల కోసం ఆందోళన చేస్తారా..?**

**ఇరాన్ మద్దతు దారులు ఈ దేశాన్ని విడిచి వెళ్లండి..**

**ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై ఎమ్మెల్యే రాజాసింగ్ ఫైర్**

**ఖమేనీ మద్దతుదారులను ఇరాన్ పంపేయండి : యాంకర్ రష్మి**





**ప్రతిఘటన, హైదరాబాద్ :** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణానికి నిరసనగా ఓవైసీ నేతృత్వంలో నిరసన ర్యాలీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ర్యాలీలను రాజాసింగ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇక్కడ ర్యాలీలు తీయడం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. నిజంగానే ఇరాన్ పట్ల అంతటి అభిమానం ఉంటే నేరుగా అక్కడికే వెళ్లి యుద్ధం చేయాలని ఆయన సూచించారు. "ఓవైసీకి ఇరాన్ వెళ్లాలని ఉంటే చెప్పండి.. నేనే స్వయంగా ఫ్లైట్ టికెట్ బుక్ చేసి ఇస్తాను" అని రాజాసింగ్ ఎద్దేవా చేశారు.ఇరాన్ కు అనుకూలంగా ఇక్కడ రోడ్లపైకి వచ్చి ర్యాలీలు తీస్తున్న వారిని వెంటనే ఆ దేశానికి పంపించేయాలని ఆయన డిమాండ్ చేశారు. మన దేశంలో ఉంటూ పరాయి దేశాధినేతల కోసం ఆందోళనలు చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. పశ్చిమ ఆసియాలో యుద్ధం జరుగుతుంటే ఇక్కడ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించడంపై రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్ కు మద్దతుగా నిలిచేవారు ఇక్కడ ఉండటం కన్నా.. యుద్ధక్షేత్రానికి వెళ్లి తమ మద్దతు తెలపడమే సరైన మార్గమని ఆయన వ్యాఖ్యానించారు.

**ఖమేనీ మద్దతుదారులను ఇరాన్ పంపేయండి : రష్మి**

ఖమేనీ మృతికి సంతాపంగా జమ్మూకశ్మీర్‌తో పాటు హైదరాబాద్, బెంగళూరు, లక్నో వంటి ప్రధాన నగరాల్లో షియా ముస్లింలు భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు. ఈ నిరసన ప్రదర్శనల్లో అమెరికా, ఇజ్రాయెల్ దేశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఈ ఆందోళనలపై ప్రముఖ యాంకర్ రష్మి గౌతమ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భారతదేశంలో ఉంటూ ఇరాన్ నేత కోసం వీధుల్లోకి వచ్చి ఆందోళన చేయడంపై రష్మి విస్మయం వ్యక్తం చేశారు. "భారతదేశంలో నిరసనలు చేయడం వల్ల ప్రయోజనం ఏముంటుంది? మీకు ఇరాన్ పట్ల అంతటి ప్రేమ ఉంటే.. ప్రధాని మోదీ గారికి నాదొక చిన్న విన్నపం. వీరందరినీ ఇరాన్ పంపించేయండి. వారు నేరుగా అక్కడికి వెళ్లి ఆ దేశం తరఫున యుద్ధం చేస్తారు" అంటూ ఘాటుగా స్పందించారు. విదేశీ వ్యవహారాల కోసం మన దేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.

## హోలీ సెలవుపై గందరగోళం



**ప్రతిఘటన, హైదరాబాద్ :** కామ దహనం ఎప్పుడు?.. హోలీ పండుగ జరుపుకునేది ఎన్నడు..? అనే విషయంపై కొంత గందరగోళమే ఏర్పడింది.. ఇక, ప్రభుత్వం ఏ రోజు హోలీ సెలవు ఇస్తుంది? అనే అంశంపై కూడా కొంత క్లారిటీ లేకుండా పోయింది.. దీనికి ప్రధాన కారణం తెలంగాణ పాఠశాల విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్‌లో ఓ తేదీని పేర్కొంటే.. ప్రభుత్వం మరో రోజు సెలవు ఇవ్వడం మరింత కన్‌ఫ్యూజన్‌కు దారి తీసింది.. అయితే, ఈ భిన్న సెలవులపై క్లారిటీ ఇచ్చేసింది తెలంగాణ ప్రభుత్వం. ప్రభుత్వం ప్రకటించిన విధంగానే పాఠశాలలకు కూడా రేపే సెలవు ఉండనుంది.. పాఠశాల విద్యా శాఖ తన అకడమిక్ క్యాలెండర్ లో మార్చి 4వ తేదీన హోలీ పండుగ సెలవుగా ప్రకటించింది.. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ.. మార్చి 4వ తేదీన కాకుండా మార్చి 3వ తేదీనే సెలవు అని స్పష్టం చేస్తూ తాజాగా సర్క్యులర్ జారీ చేసింది తెలంగాణ పాఠశాల విద్యా శాఖ.. కాగా, ప్రతీ పండుగపై భిన్న వాదనలు ఉన్నట్టుగానే ఈ సారి హోలీ పండుగపై కూడా భిన్నమైన ప్రచారాలు సాగుతున్నాయి.. సోమవారం అంటే మార్చి 2వ తేదీన రాత్రి కామ దహనం చేసుకోవాలని.. మంగళవారం రోజు చంద్రగ్రహణం ఉన్న నేపథ్యంలో హోలీ జరుపుకోకూడదని.. చంద్రగ్రహణం మరుసటి రోజు అంటే మార్చి 4వ తేదీన హోలీ జరుపుకోవాలని కొంతమంది పండితులు సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు వైరల్ చేయగా.. ఇప్పుడు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మంగళవారం హోలీ హోలీడే కావడంతో.. సోమవారం కామ దహనం.. అదే విధంగా మార్చి 3న మంగళవారం హోలీ పండుగ ఉన్నట్టు ప్రభుత్వ ప్రకటనతో క్లారిటీ ఇచ్చినట్టు అయ్యింది.

## 2 లక్షల ఉద్యోగాల హామీ ఎక్కడ?

**జాబ్ క్యాలెండర్ ఏమైంది..?**

**రాహుల్ గాంధీని నిలదీసిన కవిత**



**ప్రతిఘటన, హైదరాబాద్ :** ఎస్సీ ల్లో ఉపకులాలకు కూడా రిజర్వేషన్ ఫలాలు దక్కాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కోరారు. ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగాల్లో మాత్రమే కాకుండా రాజకీయాల్లోనూ వారికి రిజర్వేషన్లు దక్కాలన్నారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉప కులాల నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఎస్సీ ఉప కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కాల్సిన అవసరముందన్నారు. పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్టు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టం అయిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే క్రమంలోకేంద్రం చేపట్టే జనగణన లెక్కల కోసం ఎదురుచూస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర జనాభా లెక్కలకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. రిజర్వేషన్ ల పెంపునకు అసెంబ్లీ లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాలతో కలిసి జాగృతి పోరాటం చేస్తుందని చెప్పారు. ఎస్సీ ఉప కులాల్లో కొన్ని కులాలకు క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉప కులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రెండు నాలుకల కేటీఆర్

**రేవంత్ సర్కార్‌పై విషప్రచారం..**

**నిమిషాల్లోనే అడ్డంగా దొరికిపోయిన కేటీఆర్**

**అసలు నిజమేంటి..?**

**సోషల్ మీడియాలో తెగ ట్రోల్స్**

**కాంగ్రెస్ శ్రేణులు ఫైర్..**



**ప్రతిఘటన, హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మాజీ మంత్రి కేటీఆర్ తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రేవంత్ సర్కార్ పై నిత్యం బురద చల్లడమే లక్ష్యంగా ఆయన చేస్తున్న వ్యాఖ్యలు ఇప్పుడు ఆయనకే ఎదురుదెబ్బ తగులుతున్నాయి. హైదరాబాద్ వేదికగా మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. ఒకే అంశంపై రెండు భిన్నమైన మాటలు చెప్పి సోషల్ మీడియాలో నెటిజన్లకు అడ్డంగా దొరికిపోయారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడంతో పాటు ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు ఆయన ఫేక్ ప్రచారాన్ని నమ్ముకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌లోని మధు పార్క్ అపార్ట్‌మెంట్స్ అంశంపై కేటీఆర్ మాట్లాడిన తీరు కొంత విస్మయానికి గురి చేస్తోంది. ప్రసంగం ప్రారంభించిన రెండు నిమిషాల వ్యవధిలోనే ఆయన తన మాటను మార్చుకున్నారు. మొదట మాట్లాడుతూ.. 'మధు పార్క్ అపార్ట్‌మెంట్లను కూల్చివేసి అక్కడ గాంధీ విగ్రహం కడతారు' అని ఆరోపించారు. సరిగ్గా రెండు నిమిషాల తర్వాత అదే నోటితో.. 'అక్కడ అపార్ట్‌మెంట్‌లు కూల్చి ఫైవ్ స్టార్ హోటల్ నిర్మిస్తారు' అంటూ మరో బాంబు పేల్చారు. ఒకే వేదికపై ఒకే అంశం గురించి పొంతన లేని వ్యాఖ్యలు చేయడంతో కేటీఆర్ నిజ స్వరూపం బయటపడిందని బయట జనాలు మాట్లాడుకుంటున్నారు.

**అసలు నిజమేంటి అంటే..?**

వాస్తవానికి మధు పార్క్ అపార్ట్‌మెంట్‌ల స్థానంలో హైదరాబాద్ నగర భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఒక భారీ రిజర్వాయర్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. పెరుగుతున్న జనాభాకు తాగునీటి ఎద్దడి కలగకుండా ఉండాలనే ముందుచూపుతో ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రజలకు ఉపయోగపడే రిజర్వాయర్ నిర్మాణంపై విషం చిమ్ముతూ.. అబద్ధపు ప్రచారాలు చేయడమే కేటీఆర్ పనిగా పెట్టుకున్నారని కాంగ్రెస్ శ్రేణులు మండిపడుతున్నాయి.

**సోషల్ మీడియాలో మస్త్ ట్రోల్స్..**

కేటీఆర్ చేసిన ఈ పరస్పర విరుద్ధ వ్యాఖ్యలపై నెటిజన్లు ఓ రేంజ్‌లో కామెంట్లు చేస్తున్నారు. 'ఫేక్ ప్రచారం అంటే ఇలాగే ఉంటుంది' అంటూ మీమ్స్‌తో విరుచుకుపడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం కేటీఆర్‌కు అలవాటేనని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆయన ప్రసంగాల్లో కనిపించే అహంకారం ఏమాత్రం తగ్గలేదని.. ప్రజలు అన్ని గమనిస్తున్నారని సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

**కాంగ్రెస్ శ్రేణులు ఫైర్..**

రేవంత్ సర్కార్‌ను ఎలాగైనా బద్నాం చేయాలనే కుట్రతోనే బీఆర్ఎస్ నేతలు ఇలాంటి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఫైర్ అవుతున్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఫేక్ వార్తలను ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. కేటీఆర్ తన శైలిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే ఆయనకు మరోసారి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నారు. మొత్తానికి కేటీఆర్ చేసిన డబుల్ టాక్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో, ఇటు సోషల్ మీడియాలో తెగ ట్రోల్ వస్తున్నాయి.

